సాక్షి
కాకినాడ

ఆదివారం । 9 । ఏప్రిల్ । 2023



అన్నదానానికి విరాళం


సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనృసింహుని ఆలయంలో శనివారం నిత్యాన్నదానానికి పోతూరి సోమశేఖర్, సుహాసిని దంపతులు(మచిలీపట్నం) రూ.50వేలు విరాళం అందజేశారు.




మొక్కజొన్న.. లాభాల మిన్న

మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందుతున్నారు. - 8లో ▸

డెల్టాలకు నీరు విడుదల



ధవళేశ్వరం: బ్యారేజి నుంచి శనివారం తూర్పు డెల్టాకు 2,185, మధ్య డెల్టాకు 1,420, పశ్చిమ డెల్టాకు 3,800 క్యూసెక్కుల నీటిని వదిలారు. బ్యారేజీ వద్ద 6.55 అడుగులకు నీటి మట్టం చేరింది.



పరివర్తన బాటతో పదుగురికీ సేవ

- పులిమేరులో యోగాశ్రమం ఏర్పాటు
- మరోవక్క ఆయుర్వేద వైద్యసేవలు
- తాజాగా పోషక అల్పాహారం విక్రయం
- జైలు నుంచి గురువుగా మారిన వైనం



వృద్ధులకు అల్పహారాన్ని అందిస్తున్న యోగా గురువు



రూ.30లకే అందిస్తున్న ప్లేటు పౌష్టికాహార అల్పాహారం

పెద్దాపురం: జైలులో అలవర్చుకున్న ఆరోగ్య స్పృహను పదిమందికీ తెలియజేస్తున్నాడు మసిముక్కల రామకృష్ణ. అక్కడ నేర్చుకున్న యోగాను బయటకొచ్చి నేర్పుతూ గురువుగా ఎదిగాడు. ఇప్పుడు మరో అడుగు ముందుకేసి ఉదయం పోషకవిలువతో కూడిన అల్పాహారాన్ని అందిస్తున్నాడు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలేనికి చెందిన రామకృష్ణకు సుమారు 15 ఏళ్ల కిందట రాజకీయ ఘర్షణల నేపథ్యంలో ఓ హత్య కేసులో యావజ్జీవ జైలుశిక్ష పడింది. అతను జైలుకు వెళ్లడంతో భార్య సుబ్బలక్ష్మి తన కుమారుడు, కుమార్తెను వెంటబెట్టుకుని పెద్దాపురం మండలం దివిలిలోని పుట్టింటికి చేరుకుంది. కుట్టు మెషీన్ సాయంతో పిల్లలను పోషించింది. 2016 జనవరి 26న సత్ప్రవర్తన కేటరిగిలో రామకృష్ణ జైలు నుంచి విడుదలయ్యాడు. స్వగ్రామం వెళ్లలేక అత్తావారింటికి కాపురం వచ్చేశాడు.

ఇటు యోగా.. అటు వైద్య సేవలు

జైలు నుంచి వచ్చాక రామకృష్ణ తన చుట్టూ ఉన్న వారికి ఏదైనా మంచి చేయాలని సంకల్పించాడు. జైలులో నేర్చుకున్న యోగాపై చుట్టుపక్కల ఉన్నవారికి అవగాహన కల్పించడం ప్రారంభించాడు. దీనిపై పులిమేరు పరిసర గ్రామాల్లో విస్తృత ప్రచారం చేశారు. ఇప్పటికీ కొనసాగిస్తున్నాడు. పదిహేను రోజులకోసారి దివిలి, తిరుపతి, చదలాడ, పులిమేరు, పిఠాపురం మండలం విరవ గ్రామాల్లో యోగాసనాలపై శిక్షణ ఇస్తున్నాడు. పులిమేరులో యోగాశ్రమాన్ని నెలకొల్పాడు. 12 ఏళ్ల కుర్రాడి నుంచి 60 ఏళ్ల వృద్ధుల వరకూ సుమారు వంద మంది యోగా నేర్చుకుంటున్నారు. తనకు తెలిసిన ఆయుర్వేద వైద్యంతో రామకృష్ణ చిన్నపాటి రోగాలకు చికిత్స చేస్తున్నాడు. ఇటీవల పోషక విలువల ఆహారాన్ని తయారుచేసి విక్రయించడం ప్రారంభించాడు. సేంద్రియ సాగు ఉత్పత్తులతో ఆహార పదార్థాలను తయారు చేస్తున్నాడు. బ్లాక్ రైస్ ఇడ్లీ, నానబెట్టిన మొలకలు, కొర్రలు ఉప్మా, ఆయిల్‌లెస్ దోసె, చోడి అంబలిని కలిపి అల్పాహారంగా అమ్ముతున్నాడు. సాధారణ ధరకే విక్రయిస్తూ ప్రజారోగ్య పరిరక్షణకు కృషి చేస్తున్నాడు.

పోషకాల టిఫిన్

రోజూ ఉదయం గతంలో ఇక్కడి హోటల్స్‌లో చాలా మంది ఆయిల్‌తో చేసిన టిఫిన్లు తినేవారు. జనంలో ఇప్పుడు ఆరోగ్యంపై అవగాహన పెరిగింది. ఉదయాన్నే ఇలాంటివి తినడం వల్ల అనారోగ్యాన్ని కొని తెచ్చుకోవడమేనని గ్రహిస్తున్నారు. అలాంటి వారంతా పోషకాహారంపై మొగ్గు చూపిస్తున్నారు. సేంద్రియ పంటలతో చేసిన వంటకాలపై ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ తరహా ఆహారాన్ని ఇష్టపడేవారు తన లాంటి వారి వద్ద కొనుగోలు చేస్తున్నారని రామకృష్ణ చెప్పారు.

సండే స్పెషల్

ఆరోగ్యం గురించి తెలియజెప్పాలని..



జైలు నుంచి వచ్చాక పెట్రోల్ బంకులో పనిచేశాను. టైలరింగ్ వృత్తి చేశాను. బతుకు గడ
వడం
మాటిలా ఉన్నా జైలులో నేర్చుకున్న ఆరోగ్య అంశాలను పదిమందికీ తెలియజేస్తే బాగుంటుందనే ఆలోచన వచ్చింది. జైలు జీవితం తెచ్చిన పరివర్తనను కూడా తెలియజెప్పాల్సిన అవసరం ఉందని అనిపించింది. ఇక్కడ నేర్చుకున్న యోగా గురించి చుట్టూ ఉన్నవారికి చెప్పాలని భావించాను. నెమ్మది నెమ్మదిగా ముందడుగు వేయగలిగాను. చాలామంది ప్రోత్సహించారు. ఏం చేసినా ప్రజల ఆరోగ్యం పెంచేదిగా ఉండాలని భావించి ఇప్పుడు పోషకాహారాన్ని కూడా విక్రయిస్తున్నాను. వ్యాపార దృక్పథంతో కాదు. ఆరోగ్య స్పృహ కలిగించాలనేదే నా ప్రయత్నం.

– మసిముక్కల రామకృష్ణ, పులిమేరు.

న్యూస్‌రీల్

కాకినాడ ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ పంపిణీ



నరసింహరావుకు ఫించన్ అందజేస్తున్న వలంటీర్ వీరవైష్ణవి

గోకవరం: కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న పెంటపల్లి గ్రామానికి చెందిన నీలపాల నరసింహరావుకు గ్రామ వలంటీర్ వీరవైష్ణవి శనివారం పెన్షన్ అందజేశారు. నరసింహరావు అనారోగ్యానికి గురై గత 15 రోజులుగా కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నెలకు చెందిన పెన్షన్ సొమ్ము సచివాలయానికి చేరింది. అతని ఆరోగ్యం గురించి తెలుసుకున్న వలంటీర్ గంటికోట వీరవైష్ణవి సొంత ఖర్చులతో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పింఛన్ సొమ్ము రూ.2,750 అందజేశారు. సచివాలయ సిబ్బంది, స్థానిక నాయకులు, సహ వలంటీర్లు ఆమెను అభినందించారు.

ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా విజయబాబు



కాకినాడ రూరల్: ఆంధ్రప్రదేశ్ స్పెషల్ పోలీసు 3వ బెటాలియన్‌కు కమాండెంట్‌గా సీహెచ్.విజయబాబు నియమితులయ్యారు. ఇప్పటి వరకు ఇన్‌చార్జి కమాండెంట్‌గా జిల్లా ఎస్పీ రవీంద్రనాథ్ బాబు వ్యవహరించారు. తాజాగా ఆయన బదిలీ అయ్యారు. కొత్తగా నియమితులైన విజయబాబు బాధ్యతలు స్వీకరించనున్నారు.

సత్యదేవుని దర్శించిన హైకోర్టు న్యాయమూర్తి



వ్రతమాచరిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మల్లికార్జునరావు దంపతులు

అన్నవరం: రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి టి.మల్లికార్జునరావు కుటుంబ సభ్యులతో కలిసి శనివారం రత్నగిరిపై సత్యదేవుని వ్రతమాచరించి స్వామివారికి పూజలు చేశారు. ఆలయం వద్ద వారికి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆధ్వర్యంలో పండితులు ఘనంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం అనంతరం వేదపండితులు వేదాశీస్సులు అందజేశారు. స్వామివారి ప్రసాదాలను ఏఈఓ కృష్ణారావు అందజేశారు.

రత్నగిరి.. భక్తజన ఝురి



సత్యదేవుని ఆలయం వద్ద ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఈఓ చంద్రశేఖర్ అజాద్

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని ఆలయం శనివారం వేలాదిగా తరలి వచ్చిన భక్తులతో కిక్కిరిసింది. శుక్రవారం గుడ్ ఫ్రైడే, రెండో శనివారం, ఆదివారం వరుసగా మూడురోజులు సెలవులు రావడంతో స్వామివారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. సుమారు 50 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించి పూజలు చేశారు. తెల్లవారుజాము నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారి సన్నిధికి తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి గంట, ప్రత్యేక దర్శనానికి అరగంట సమయం పట్టింది. సత్యదేవుడిని దర్శించిన భక్తులు సప్తగోకులంలో గోవులకు ప్రదక్షణ చేశారు. రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి ప్రదక్షణ చేశారు. స్వామివారి వ్రతాలు 2,500 జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.50 లక్షల ఆదాయం సమకూరింది. సుమారు ఐదు వేల మంది భక్తులకు సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో ఉచిత భోజన సౌకర్యం కల్పించారు. దేవస్థానం ఈఓ చంద్రశేఖర్ అజాద్ స్వామివారి ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. భక్తుల తాకిడి అధికంగా ఉండడంతో అంతరాలయ దర్శనాన్ని తాత్కాలికంగా నిలిపివేసి వెలుపల నుంచి భక్తులను పంపించారు.

12న వినికిడి యంత్రాల పంపిణీ



సమావేశంలో మాట్లాడుతున్న రామాంజనేయులు

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): కాకినాడ పార్లమెంట్ పరిధిలోని ప్రజలకు ఈ నెల 12న ఉదయం 10 గంటలకు చల్లా కల్యాణ మండపంలో ఉచిత వినికిడి యంత్రాలు పంపిణీ చేయనున్నట్లు దీన్‌దయాళ్ శ్రవణ ఫౌండేషన్ చైర్మన్ రేగుల రామాంజనేయులు తెలిపారు. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు రాష్ట్ర వ్యాప్తంగా 12 వేల మందికి వినికిడి యంత్రాలు అందించామన్నారు. తోట సుబ్బారావు రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఉదయం వైద్య శిబిరంలో పరీక్షలు చేసి అవసరమైన వారికి మధ్యాహ్నం వినికిడి యంత్రాలు అందిస్తామన్నారు. ట్రస్ట్ అధ్యక్షుడు తోట వెంకట సర్వారాయుడు మాట్లాడుతూ ఈ శిబిరాన్ని ఎంపీ వంగా గీత, రూరల్ ఎమ్మెల్యే కురసాల కన్నబాబు ప్రారంభిస్తారని తెలిపారు.

క్రీడలకు అధిక ప్రాధాన్యం

- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి దాడిశెట్టి రాజా
- స్కేటింగ్ ట్రాక్, అంతర్ జిల్లా స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలు ప్రారంభం



తుని మున్సిపల్ పార్కులో స్కేటింగ్ ట్రాక్‌ను ప్రారంభిస్తున్న మంత్రి దాడిశెట్టి రాజా

తుని: రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిస్తోందని, క్రీడలకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సహకారం వెలకట్టలేనిదని రోడ్లు, భవనాలశాఖ మంత్రి దాడిశెట్టి రాజా అన్నారు. తుని రాజా రాజబాబు మున్సిపల్ పార్కులో రూ.40 లక్షలతో నిర్మించిన స్కేటింగ్ ట్రాక్‌ను శనివారం మున్సిపల్ చైర్‌పర్సన్ ఏలూరి సుధారాణితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం అంతర్ జిల్లా రోలింగ్ స్కేటింగ్ చాంపియన్ షిప్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి క్రీడాకారులకు అందిస్తున్న ప్రోత్సాహకాలు మాటల్లో వర్ణించలేమన్నారు. ఇప్పటికే పలువురు క్రీడాకారులకు ప్రభుత్వ పరంగా సహకారం అందించారన్నారు. తునిలో స్కేటింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు అంతర్ జిల్లా స్థాయి స్కేటింగ్ పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. తునికి చెందిన ఔత్సాహిక క్రీడాకారులకు రోలర్ స్కేటింగ్ అసోషియేషన్ శిక్షణ ఇవ్వాలని సూచించారు. స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు పొందిన క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన సచివాలయాల్లో 200 మంది స్పోర్ట్సు కోటాలో ఉద్యోగాలు పొందారని గుర్తు చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాల నుంచి వచ్చిన స్కేటింగ్ క్రీడాకారుల ప్రదర్శనను ఆయన తిలకించారు. అనంతరం స్కేటింగ్ ట్రాక్ నిర్మాణంతో పాటు పోటీల నిర్వహణకు సహకరించిన అసోసియేషన్ ప్రతినిధులు, స్పోర్ట్సు అధికారులను ఘనంగా సత్కరించారు. తుని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మాకినీడి బాబు, ఎంపీపీలు బొప్పన రాము, లగుడు శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ తుని పట్టణ, మండలాధ్యక్షులు రేలంగి రమణాగౌడ్, పోతల రమణ, పార్టీ యువజన విభాగం తుని నియోజకవర్గ అధ్యక్షుడు ఏలూరి బాలు, లోవదేవస్థానం చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొయ్యా మురళీ, జిల్లా వక్ఫ్‌బోర్డు వైస్ చైర్మన్ షేక్ ఖ్వాజా, మున్సిపల్ వైస్ చైర్మన్ పామర్తి మహేష్, జెడ్‌ఆర్‌యూసీసీ సభ్యుడు బోడపాటి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మ పుట్టింటి సంబరాలకు రెడీ

- నేటి నుంచి ఉత్సవాలు
- 19న అమ్మవారి జాగరణ, 20న దర్శనాలు



లోవకొత్తూరులోని తలుపులమ్మ తల్లి

తుని రూరల్: కోస్తా జిల్లాల భక్తుల ఆరాధ్యదైవం, కోరిన కోర్కెలు తీర్చే లోవ తలుపులమ్మ అమ్మవారి పుట్టింటి సంబరాలు ఆదివారం నుంచి ఈ నెల 20 వరకూ జరగనున్నాయి. ఈ మేరకు లోవ దేవస్థానం అధికారులు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఏటా గంధామావాస్య పర్వదినాన్ని పురస్కరించుకుని లోవ కొత్తూరు గ్రామంలో తలుపులమ్మ తల్లికి పుట్టింటి సంబరాలు, ఆషాఢ మాసంలో లోవ దేవస్థానం ఆవరణలో నెలరోజుల పాటు ఆషాఢ మాసోత్సవాలు నిర్వహించడం ఆనవాయితీ. 12 రోజుల ఉత్సవాల అనంతరం అమ్మవారి దర్శనాలు, తీర్థం నిర్వహిస్తారు. ఈ ఏడాది గ్రామస్తుల అభీష్టం మేరకు దేవస్థానం అధికారుల పర్యవేక్షణలో లోవ గ్రామంలోని నాలుగు ఎకరాల స్థలంలో జాతరోత్సవాలు నిర్వహిస్తున్నారు. వివిధ సాంస్కృతిక, జానపద, సాంఘిక ప్రదర్శనలు, కోలాటాలు, భజనలు, మిరమిట్లు గొలిపే విద్యుత్ దీపాలంకరణలు ఏర్పాటు చేస్తున్నారు. అమ్మవారి పుట్టింటి సంబరాలు కావడంతో ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటూ ఉపాధి, ఉద్యోగాలు చేసుకునే వారు, ఆడపడుచులు, అల్లుళ్లు, బంధుమిత్రులు లోవకొత్తూరు వచ్చి అమ్మవారి జాతరోత్సవాల్లో సందడి చేస్తారు.

సాంస్కృతిక కార్యక్రమాలు

మొదట రోజు ఆదివారం గరగలు సంబరాలతో ఉత్సవాలు ప్రారంభమై 19న జాగరణ, 20న అమ్మవారి దర్శనాలు, తీర్థంతో ఉత్సవాలు ముగుస్తాయి. 12న లోవకొత్తూరు పరిసర ప్రాంతవాసులతో మహిళా కోలాటం, 14న రావులపాలెం వారితో అంధుల సంగీత విభావరి, 16న రాజమహేంద్రవరం లారెన్స్ ఈవెంట్స్ వారితో డీజే ప్రోగ్రాం, 17న విజయనగరం వారితో బాలనాగమ్మ బుర్రకథ ఏర్పాటు చేశారు. 19న సాయంత్రం ఆరు గంటల నుంచి తెల్లవార్లు జాగరణ జరుగుతుంది. ఈ సందర్భంగా తణుకు సూర్యా ఈవెంట్స్ వారితో కేరళ డప్పుల డ్యాన్స్, మహిళల బోనాల కోలాటం, శక్తి వేషాలు, మహిళల కాగడాల డ్యాన్స్, ప్రముఖ టీవీ కళాకారులతో డీజే ప్రోగ్రాం నిర్వహించనున్నారు. 20న వివిధ బళ్ల వేషాలు, భీమవరం మోహన్ ఆర్కెస్ట్రా వారితో సంగీత విభావరి ఏర్పాటు చేశారు.

వివిధ గ్రామాల్లో..

తుని ప్రాంతవాసులకు తలుపులమ్మతల్లి ఇలవేల్పు కావడంతో వివిధ గ్రామాల్లో ఉత్సవాలు నిర్వహించనునన్నారు. వి.కొత్తూరు, కొత్త వెలంపేట, సీతయ్యపేట, మర్లపాడు, రాజుపేట, జగన్నాథగిరి, గెడ్లబీడు, తాళ్లూరు, కుమ్మరిలోవ తదితర గ్రామాల్లో తలుపులమ్మతల్లి జాతరోత్సవాలను నిర్వహించేందుకు భారీగా ఏర్పాట్లు చేస్తున్నారు. వివిధ ప్రదర్శనల్లో వెండి తెర, బుల్లి తెర నటులు పాల్గొని ప్రజలను అలరించనున్నారు.

దేవస్థానం నిధులతో..



అమ్మవారి జాతరోత్సవాలను ఆదివారం ఆలయ చైర్మన్ గొర్లి అచ్చియ్యనాయుడు, ధర్మకర్తలు గరగల సంబరంతో లాంఛనంగా ప్రారంభిస్తారు. జాతరోత్సవాలకు అవసరమైన నిధులను దేవస్థానం నుంచి ఖర్చు చేస్తాం. ఉత్సవాలను పర్యవేక్షించేందుకు దేవస్థానం అధికారులకు బాధ్యతలు అప్పగించాం. నేను, ధర్మకర్తలు ఏర్పాట్లను పర్యవేక్షిస్తాం.

– పెన్మెత్స విశ్వనాథరాజు, ఈఓ, లోవ దేవస్థానం

శాంతి భద్రతల విషయంలో రాజీ పడను

- 'సాక్షి'తో కొత్త ఎస్పీ సతీష్‌కుమార్
- రవీంద్రనాథ్‌బాబుకు బదిలీ



జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

సాక్షిప్రతినిధి,కాకినాడ: జిల్లా కొత్త ఎస్పీగా ఎస్.సతీష్‌కుమార్ రానున్నారు. ఇప్పటివరకూ జిల్లా ఎస్పీగా పనిచేసిన ఎం.రవీంద్రనాథ్‌బాబు శుక్రవారం రాత్రి బదిలీఅయ్యారు. విభజనకు ముందు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చివరి ఎస్పీ ఈయనే. విభజన తర్వాత కాకినాడ జిల్లా తొలి ఎస్పీగా బాధ్యతలు నిర్వర్తించారు. వివాదరహితుడిగా కొనసాగారు. రవీంద్రనాథ్ బాబు స్థానంలో వస్తున్న సతీష్‌కుమార్ ప్రస్తుతం అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీగా పనిచేస్తున్నారు. ఈ యువకుడు తమిళనాడు ఈరోడ్‌కు చెందిన వారు. తెలుగు స్పష్టంగా మాట్లాడతారు. 2016 ఆంధ్రా క్యాడర్‌కు చెందిన వారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని చింతపల్లి అదనపు ఎస్పీగా ఈయన తొలిపోస్టింగ్. ఏడాదిన్నర తర్వాత నర్సీపట్నం గ్రేహౌండ్స్ విభాగంలో ఆఫీస్ ఆన్ స్పెషల్ డ్యూటీ(ఓఎస్‌డీ)గా 14 నెలలు పాటు పనిచేశారు. అక్కడి నుంచి విశాఖపట్నం సిటీ, విశాఖ రూరల్ స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరోలో ఏడాది పాటు పనిచేశారు. గతేడాది జిల్లాల పునర్విభజన తరువాత అల్లూరి సీతారామరాజు జిల్లా తొలి ఎస్పీగా నియమితులయ్యారు. నాలుగున్నరేళ్ల సర్వీసులో అత్యధికంగా మన్యంలోనే విధులు నిర్వహించారు. మన్యంలోని నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో గిరిజనులకు ఉద్యోగ అవకాశాలు కల్పించి మార్పునకు కృషి చేసి ప్రభుత్వం నుంచి ఈయన ప్రశంసలందుకున్నారు. ముక్కుసూటిగా వ్యవహరిస్తారని ముద్ర పడ్డారు. అలాగే ఫ్రెండ్లీ పోలీసింగ్, విధి నిర్వహణలో నిక్కచ్చిగా ఉంటారనే పేరుంది. తొలిసారి మైదాన ప్రాంత జిల్లాకు వస్తున్న సతీష్‌కుమార్‌తో శనివారం 'సాక్షి ప్రతినిధి' ఫోన్‌లో మాట్లాడారు.

కొత్త ఎస్పీ ఏమన్నారంటే...

కచ్చితంగా ఇదో డిఫరెంట్ చాలెంజ్. ఇంతవరకు పనిచేసిన ప్రాంతం, పరిస్థితులు వేరు. ఇక ముందు పనిచేసే వాతావరణం వేరు అని అనుకుంటాను. అయితే ప్రాంతాలు వేరైనా పోలీసు పాత్ర ఒక్కటే. పేదవాళ్లకు ఏ సమయంలోనైనా న్యాయం చేయాలనేదే ప్రధాన అజెండా. శాంతిభద్రతల విషయంలో రాజీపడను. అన్ని వర్గాల ప్రజలు స్వేచ్ఛగా ఉన్నామనే భావనతో ఉండాలనే లక్ష్యంతో పనిచేస్తాను. నాతో పాటు పోలీసులంతా ఇదే భావనతో పనిచేసేలా చూస్తాను. ఏజెన్సీలో బోయ, వాల్మీకులకు రిజర్వేషన్లు, నిర్వాసిత గిరిజనులకు ఆర్‌ఆర్ ప్యాకేజీ విషయంలో కొన్ని సవాళ్లను ఎదుర్కొన్నాను. కొత్త జిల్లా పరిస్థితులు అర్థంచేసుకుంటాను. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే బాధ్యతలు స్వీకరిస్తానని సతీష్‌కుమార్ వివరించారు.

క్లుప్తంగా

గురుకులాల్లో ప్రవేశాలకు 24 వరకూ దరఖాస్తుల స్వీకరణ

తుని రూరల్: మండలంలోని ఎస్.అన్నవరం శివారు జగన్నాథగిరిలో ఉన్న ఏపీ గురుకుల బాలికల పాఠశాలలో ఐదో తరగతి ప్రవేశాలకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. 2023–24 విద్యా సంవత్సరానికిగాను ఈ నెల 24వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు పంపించాలని ప్రధానోపాధ్యాయిని ఎస్.వెంకటలక్ష్మి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మే 20న జరిగే ప్రవేశ పరీక్ష ద్వారా ఎంపికలు జరుగుతాయన్నారు. అభ్యర్థులు 2021–23 విద్యా సంవత్సరాల్లో 3, 4 తరగతులు చదివి ఉండాలని పేర్కొన్నారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలోని గ్రామీణ ప్రాంత విద్యార్థినులు దీనికి అర్హులన్నారు. 2012 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఓసీ, బీసీలు; 2010 సెప్టెంబర్ 1 నుంచి 2014 ఆగస్టు 31 మధ్య జన్మించిన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చని వివరించారు. ప్రవేశ పరీక్ష తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఉంటుందన్నారు. ఏపీఆర్ఎస్.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మరిన్ని వివరాలకు 98665 59624 నంబరుకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చని వెంకటలక్ష్మి తెలిపారు.

అదుపు తప్పి చెట్టును ఢీకొట్టిన కారు




సంఘటన స్థలంలో చెట్టును ఢీకొట్టిన కారు

గండేపల్లి: పదహారో నంబర్ జాతీయ రహదారిపై కారు అదుపు తప్పి, చెట్టును ఢీకొంది. పోలీసులు, హైవే మెయింటెనెన్స్ సిబ్బంది, స్థానికుల కథనం ప్రకారం.. కాకినాడలోని ఓ ప్రైవేటు కళాశాలలో డిగ్రీ చదువుతున్న బెన్ని, కౌశిక్, ప్రవీణ్, భరత్, సూర్య కలిసి శనివారం కారులో విశాఖ వెళ్లారు. తిరుగు ప్రయాణంలో స్నేహితుడిని సూరంపాలెంలో దించాలని నిర్ణయించుకున్నారు. ఈ క్రమంలో వారి కారు గండేపల్లి శివారులో లారీని ఓవర్‌టేక్ చేస్తుండగా అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకుపోయి, అక్కడున్న చెట్టును బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు విద్యార్థులూ తీవ్రంగా గాయపడ్డారు. సంఘటన స్థలానికి హైవే మెయింటెనెన్స్, రోడ్డు సెఫ్టీ సిబ్బంది చేరుకుని, కారులో ఇరుక్కుపోయిన క్షతగాత్రులను బయటకు తీశారు. 108, హైవే అంబులెన్సుల్లో రాజమహేంద్రవరం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

పాడి-పంట

మొక్కజొన్న.. లాభాలు మిన్న



- హైబ్రిడ్ విత్తనాలు మేలంటున్న శాస్త్రవేత్తలు
- పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రత్యేక దృష్టి
- ఎకరాకు 35 క్వింటాళ్ల వరకూ దిగుబడి

సామర్లకోట: మెట్ట ప్రాంత రైతులు అనేక మంది తమ భూములను నిరుపయోగంగా వదిలేస్తున్నారు. అటువంటి వారు మొక్కజొన్న తోటలు వేసుకోవడం ద్వారా లాభాలు పొందే అవకాశాలున్నాయని పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న మనిషికి ఆహారంగానే కాకుండా పశువులకు దాణాగా కూడా ఉపయోగపడుతుంది. మొక్కజొన్నతో అనేక రకాల పిండి వంటలు కూడా తయారు చేస్తారు. ఇటీవల మొక్కజొన్న సాగుపై రైతుల్లో అవగాహన పెరగడంతో వారిని ప్రోత్సహించడానికి వ్యవసాయ అధికారులు కూడా ముందుకు వస్తున్నారు. ఇందులో భాగంగా సంకరజాతి విత్తనాలు ఉత్పత్తి చేస్తున్నామని పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు పి.మునిరత్న, ఐ.సుధీర్‌కుమార్ చెబుతున్నారు.

సాగుకు అనుకూలంగా హైబ్రీడ్ వంగడాలు

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 27,500 ఎకరాల్లో మొక్కజొన్న సాగు జరుగుతోంది. అధిక ఉత్పాదకత కలిగిన అనుకూల వాతావరణం ఉండటంతో ఇక్కడ సాగుకు దీర్ఘ, మధ్యకాలిక విభాగాల్లో అధిక దిగుబడినిచ్చే హైబ్రీడ్ వంగడాలు అనుకూలంగా ఉంటాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. మొక్కజొన్న నుంచి వివిధ ఉప ఉత్పత్తులు తయారు చేసి, ఎగుమతి చేయడం ద్వారా లాభాలు ఆర్జించే అవకాశం కూడా ఉంది. ఈ పంటపై ఆధారపడి దాదాపు 500 రకాల పరిశ్రమలు ఉన్నాయని చెబుతున్నారు. మొక్కజొన్నలోని ప్రతి పదార్థమూ వివిధ రకాల ఉత్పత్తుల తయారీకి మూలపదార్థంగా ఉపయోగపడతాయి. పశువుల మేతగా, పూత దశలో కూరగాయగా, పాలు పోసుకునే దశలో కాల్చి తినే కండెగా, గింజ ముదిరిన తరువాత అనేక రకాల పరిశ్రమల్లో ముడిసరకుగా మొక్కజొన్న ఉపయోగపడుతుంది. మొక్కజొన్న నూనెను అనేక దేశాల్లో వంటలకు వాడతారు. హృదయ సంబంధిత రోగులకు ఇది మంచిదని అంటారు. ఈ నూనెలో లినోలిక్, ఒలియిక్ ఆమ్లాలు ఎక్కువగా ఉంటాయి. కొలెస్ట్రాల్ తక్కువగా ఉంటుంది. మొక్కజొన్న పిండితో కార్న్‌ఫ్లాక్స్, సూప్‌మిక్స్, ఇన్‌స్టెంట్ కార్న్స్, పఫ్స్, ఉప్మా మిక్స్, కేసరి బాదం, పేలాల వంటి కారపు, తీపి పిండి వంటలు చేసుకోవచ్చు. ప్రత్యేక రకాలైన తీపి మొక్కజొన్న, బేబీ కార్న్ వంటి రకాలు కూడా ఉన్నాయి.

పొలం ఎంపిక ఇలా..

మురుగు నీరు నిలవని, కలుపు, తెగుళ్ల లేని సారవంతమైన నేలలు మొక్కజొన్న సాగుకు అనుకూలం. గత సీజన్‌లో మొక్కజొన్న పండించి ఉండకూడదు. ఒకవేళ మొక్కజొన్న వేసి ఉంటే జన్యు స్వచ్ఛత కోసం నీటి తడి ఇచ్చి, నేలలో గత సీజన్ విత్తనాలను మొలకెత్తనిచ్చి బెరుకులు లేకుండా దున్ని, నశింపజేయాలి. నీటి వసతి ఉండాలి. అక్టోబర్ 15 నుంచి నవంబర్ 15 వరకూ రబీ విత్తు కూడా వేసుకోవచ్చు. ఎకరానికి 10 కిలోల ఆడ, మగ విత్తనాల మోతాదు వాటి వరుసల నిష్పత్తిపై ఆధారపడి ఉంటుంది. దాదాపు సాధారణ మొక్కజొన్న పంటలో మాదిరిగానే నీటి యాజమాన్యం సరిపోతుంది. పంట అన్ని దశల్లోనూ నీటి ఎద్దడి లేకుండా చూడాలి. మొదటి తడిలో ఆడ, మగ సాళ్లలోని విత్తనాలు కలిసిపోకుండా చూడాలి. గింజ తయారయ్యే దశలో ఎకరాకు 20 కిలోల నత్రజని అదనంగా వేయాలి.

మొక్కజొన్నపై పరిశోధనలు

వ్యవసాయ పరిశోధన కేంద్రంలో మొక్కజొన్న పంటపై వివిధ పరిశోధనలు సాగిస్తున్నాం. ఉమ్మడి జిల్లాలోని రైతులకు మేలైన సాంకేతికతతో పాటు సాగులో సమస్యలకు సలహాలు, సూచనలు అందిస్తున్నాం. రబీలో ఎకరాకు 35 నుంచి 40 క్వింటాళ్లు, ఖరీఫ్‌లో 30 నుంచి 35 క్వింటాళ్ల దిగుబడి వస్తుంది.

– డాక్టర్ ఐ.సుధీర్‌కుమార్, సీనియర్ శాస్త్రవేత, వ్యవసాయ పరిశోధన స్థానం, పెద్దాపురం



పెద్దాపురం వ్యవసాయ పరిశోధన స్థానంలో సాగు చేస్తున్న మొక్కజొన్న పంట

సీఎం సభకు స్థలం పరిశీలన



బహిరంగ సభకు గోష్పాద క్షేత్రంలో స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ మాధవీలత, అధికారులు

కొవ్వూరు: 'వలంటీర్లకు వందనం' పేరుతో గ్రామ/వార్డు వలంటీర్లకు పురస్కారాలు అందించే రాష్ట్ర స్థాయి కార్యక్రమం కొవ్వూరులో ఈ నెల 14వ తేదీన జరగనుంది. ఇందులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాల్గొంటారని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కె.మాధవీలత తెలిపారు. ఈ సందర్భంగా నిర్వహించనున్న బహిరంగ సభకు అనువైన స్థలాలను శనివారం ఆమె పరిశీలించారు. రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతిని పురస్కరించుకుని గ్రామ/వార్డు వలంటీర్ల సేవలకు గుర్తింపుగా నగదు పురస్కారాలను సీఎం చేతుల మీదుగా అందించనున్నారని కలెక్టర్ తెలిపారు. సభ నిర్వహణ, హెలిప్యాడ్, వాహనాల పార్కింగ్‌కు అనువైన స్థలాలను పరిశీలించామన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సభ ఏర్పాట్లకు సంబంధించి ఇప్పటికే హోం మంత్రి తానేటి వనితతో కలిసి ఐదారు స్థలాలను సందర్శించారు. పట్టణంలోని సత్యవతి నగర్‌లో ఉన్న స్థలాలను, సంస్కృత పాఠశాల ప్రాంగణం, గోష్పాద క్షేత్రం వెనుక ఉన్న ఖాళీ స్థలాన్ని పరిశీలించారు. బహిరంగ సభ నిర్వహించే స్థలం ఇంకా కొలిక్కి రాలేదని కలెక్టర్ చెప్పారు. అన్నింటికీ అనువుగా ఉండే స్థలాన్ని ఎంపిక చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్.తేజ్‌భరత్, రాజమహేంద్రవరం నగరపాలక సంస్థ కమిషనర్ కె.దినేష్ కుమార్, ఆర్‌డీఓ ఎస్.మల్లిబాబు, ఆర్‌అండ్‌బీ ఈఈ ఐ.దేవేంద్రరాజు, డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ, కొవ్వూరు మున్సిపల్ కమిషనర్ బి.శ్రీకాంత్, తహసీల్దార్ బి.నాగరాజు నాయక్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

రత్నగిరిపై వివాహాల రిజిస్ట్రేషన్ల నిలుపుదల

అన్నవరం: శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివాహాల రిజిస్ట్రేషన్లను నిలుపు చేస్తున్నట్టు అధికారులు తెలిపారు. గతంలో వివాహాలు చేసుకున్నవారి అభ్యర్థన మేరకు అవసరమైన పత్రాలు సమర్పిస్తే వాటి ఆధారంగా రిజిస్ట్రేషన్లు చేసేవారు. అయితే న్యాయపరమైన చిక్కులు ఎదురవుతూండటంతో ఆ రిజిస్ట్రేషన్లను నిలుపు చేసినట్టు దేవస్థానం అధికారులు తెలిపారు.

ఆన్‌లైన్ వ్రత సమయం మార్పు

సత్యదేవుని సన్నిధికి వచ్చి, స్వామివారి వ్రతం చేయించుకునే వెసులుబాటు లేనివారు ఆన్‌లైన్‌లో రూ.1,116 చెల్లిస్తే వారి గోత్రనామాలతో వ్రతం ఆచరించే వీలు కల్పించిన విషయం విదితమే. ఇప్పటి వరకూ ఉదయం 9 గంటలకు ఈ వ్రతం నిర్వహించి, దానిని దేవస్థానం యూట్యూబ్ చానల్‌లో ప్రత్యక్ష ప్రసారం చేసేవారు. దీని వలన ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే స్వామివారి కల్యాణం ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశం ఉండేది కాదు. దీంతో ఆన్‌లైన్ వ్రతాన్ని గంట ముందుకు మార్చారు. ఆదివారం నుంచి ప్రతి రోజూ ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకూ నిర్వహించాలని నిర్ణయించారు. ఆన్‌లైన్ వ్రతం అనంతరం ఉదయం 9.30 నుంచి 11 గంటల వరకూ సత్యదేవుని నిత్యకల్యాణాన్ని ప్రత్యక్ష ప్రసారం చేస్తారు.

భార్యాపిల్లల అదృశ్యంపై ఫిర్యాదు

కడియం: తన భార్య, ముగ్గురు పిల్లలు కనిపించడం లేదంటూ కడియం మండలం వీరవరం గ్రామానికి చెందిన ఐ.శ్రీనుబాబు పోలీసులను ఆశ్రయించాడు. గత ఏడాది నవంబర్ 30న తన భార్య ధన సాయిలక్ష్మి, తొమ్మిదేళ్ల కుమార్తె విజయకనకదుర్గ, ఏడేళ్ల హర్షవర్ధన్, ఐదేళ్ల వేదశ్రీ అదృశ్యమయ్యారని శ్రీనుబాబు ఫిర్యాదు చేశాడు. తాను పనికి వెళ్లిన తరువాత స్కూలు నుంచి పిల్లలను తీసుకుని వెళ్లినట్టు తెలిసిందన్నారు. బంధువులు, తెలిసిన వారి వద్ద వెతికినప్పటికీ భార్యాపిల్లల ఆచూకీ లభ్యం కాకపోవడంతో పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ నగర్‌లో చోరీ

- రూ.5 లక్షల సొత్తు అపహరణ
- వరుస చోరీలతో అమలాపురం వాసుల ఆందోళన



చోరీ జరిగిన ఇంట్లో స్టేట్‌మెంట్లు రికార్డు చేస్తున్న పోలీసులు

అమలాపురం టౌన్: స్థానిక విద్యుత్ నగర్‌లోని ఓ ఇంట్లో శనివారం తెల్లవారుజామున జరిగిన చోరీలో రూ.5 లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైంది. విద్యుత్ శాఖలో పార్ట్‌టైమ్ ఉద్యోగిగా పని చేస్తున్న కుడుపూడి బాలకృష్ణ ఇంట్లో దొంగలు 18 కాసుల బంగారు నగలు దోచుకున్నారు. ఆ ఇంట్లో అద్దెకు ఉంటున్న బాలకృష్ణ శుక్రవారం సాయంత్రం ఇంటికి తాళం వేసి, స్వగ్రామం అమలాపురం రూరల్ మండలం పాలగుమ్మికి భార్యాపిల్లలతో వెళ్లారు. ఆయన ఇంటి తలుపులు తెరచి ఉండటాన్ని పై అంతస్తులో ఉంటున్న యజమాని సత్తి రామచంద్రమూర్తి శనివారం ఉదయం గమనించారు. ఆయన ఫోన్ ద్వారా ఇచ్చిన సమాచారంతో బాలకృష్ణ వెంటనే పాలగుమ్మి నుంచి విద్యుత్ నగర్ చేరుకున్నారు. ఇంట్లో చోరీ జరిగిందని, బీరువాలోని 18 కాసుల బంగారు నగలను దొంగలు దోచుకున్నారని గుర్తించారు. దొంగలు వీధి తలుపుల తాళం పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. బెడ్ రూమ్‌తో పాటు ఇతర గదుల్లో ఉన్న బీరువాలను తెరచి సామాన్లను చిందరవందర చేశారు. క్లూస్ టీమ్ వచ్చి దొంగల వేలిముద్రలను సేకరించింది. సంఘటన స్థలాన్ని పట్టణ సీఐ ద్వారంపూడి దుర్గాశేఖరరెడ్డి సందర్శించారు. చోరీ జరిగిన ఇంటికి సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రి సీసీ ఫుటేజీలను పరిశీలించారు. ఆ కెమెరాలు రోడ్డు వైపు ఉండటంతో కేసు దర్యాప్తులో భాగంగా ఫుటేజీలు సేకరించారు. పట్టణ ఎస్సై కేవీవీ సత్యనారాయణ, హెడ్ కానిస్టేబుల్ ఎం.సుబ్బరాజు, సిబ్బంది బాలకృష్ణ కుటుంబీకుల స్టేట్‌మెంట్లు రికార్డు చేశారు. పట్టణంలోని గాంధీనగర్‌లో ఇద్దరు ముసుగు దొంగలు గురువారం అర్ధరాత్రి ఓ ఇంట్లోకి చొరబడి యజమానిపై దాడి చేసిన విషయం తెలిసిందే. ఆ మర్నాడే విద్యుత్ నగర్‌లో చోరీ జరగడంతో పట్టణ ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

యువకుడి ఆత్మహత్య

కొవ్వూరు: పట్టణంలోని పుంతలో ముసలమ్మ గుడిలో కూచి వెంకట మోహన్ నాగసాయి దుర్గా వీరభద్ర కల్కి (18) శనివారం ఆత్మహత్య చేసుకున్నాడు. చిన్నతనం నుంచీ అతడు మేనమామ నేతి నారాయణశర్మ సంరక్షణలో పెరుగుతున్నాడు. ఈ నెల 6న నారాయణశర్మ పౌరోహిత్యం పని మీద చింతలపూడి మండలం ప్రగడవరం వెళ్లారు. ఆయన భార్య శ్రీలక్ష్మి సత్యవతి చెన్నై వెళ్లారు. ఇంటి వద్ద ఒంటరిగా ఉన్న కల్కి చున్నీతో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయాన్ని పట్టణంలో ఉంటున్న అతడి పెద్దమ్మ, నారాయణశర్మ సోదరి శనివారం గుర్తించి ఆయనకు సమాచారం అందించారు. తన మరో సోదరి కుమారుడైన కల్కి చిన్నతనం నుంచీ తన వద్దే ఉంటున్నాడని, అన్నవరం వేద పాఠశాలలో వేదవిద్య నేర్పించానని నారాయణశర్మ చెప్పారు. కల్కి ఆత్మహత్యకు కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశానని తెలిపారు.

ఉరి వేసుకుని ఆత్మహత్య

తుని: పట్టణంలోని రైల్వే స్టేషన్ సమీపాన ఒక వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ఎస్సై మురళీమోహన్ శనివారం తెలిపిన వివరాల ప్రకారం.. రైల్వే స్టేషన్ ప్రవేశ ద్వారానికి ఎడమవైపు ఉన్న కాలువ వద్ద రెండు గోడల మధ్య ఇనుప గొట్టానికి అతడు ఉరి వేసుకున్నాడు. మృతుని వద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా అతడిని అస్సాం రాష్ట్రం గోలపర గ్రామానికి చెందిన బర్మాన్ సంజయ్‌గా గుర్తించారు. వీఆర్‌ఓ ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.